హృదయ మమృత సముద్రము; వదనము కవి
తా లతాంగికి నర్తన శాల; సదన
మతిథి కోటికి నాటి ఋష్యాశ్రమము; వి
శాల వసుధాకుటుంబి ! నీ సాటి నీవె.

మా దేశిక స్వామి మత్తేభ గమనమ్ము
ఛాత్రపాళికి సదాచారశిక్ష
మా దేశిక స్వామి మంద్ర కంఠధ్వని
శిష్యరాజికి సుఖాసీనముద్ర
మా దేశిక స్వామి మధురానురాగమ్ము
కావ్యపాళికి ధైర్య కంచుకమ్ము
మా దేశిక స్వామి మంగళాశీ రేఖ
కవి కుమారులకు మార్గప్రదర్శి

మా గురుస్వామి శుభ్రాంఘ్రిమండలములు
శిష్యతతి మౌళులకు సుమశేఖరములు;
సహృదయుడు రామకృష్ణమాచార్య గురుడు;
సాటి లేనట్టి కవితా కిరీటధారి.

భోజమహీమహేంద్రు ముఖముంగని, మున్, జడుడున్, కవిత్వ వి
భ్రాజితుడయ్యె నంచు విను పల్కులు, నిక్కువమయ్యె; నీ ముఖాం
భోజము జూచినంత, నెద పొంగెను తీయని కైత; యిట్టి దౌ
వ్యాజము కాక నేను కవినౌటకు వేఱొక హేతు వున్నదే!

– శ్రీ శనగన నరసింహస్వామి